క్లుప్తంగా

యువజన విభాగం అధ్యక్షులు వీరే

తుని: వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల, పట్టణ అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర పార్టీ కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. కోటనందూరు మండలం లెక్కల ఉపేంద్ర, తొండంగి గంగిరి నాగేంద్ర, తుని మండలం కీర్తి బాలకృష్ణ, తుని పట్టణ అధ్యక్షుడిగా షేక్ మోహద్దీన్ ఖ్వాజాలను నియమించారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆశీస్సులతో తమకు పార్టీ పదవులు దక్కడం ఆనందంగా ఉందని నూతన మండల, పట్టణాధ్యక్షులు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తుని నియోజకవర్గంలో పార్టీ విజయం కృషి చేస్తామన్నారు. నూతనంగా నియమితులైన యువజన విభాగం అధ్యక్షులను పార్టీ నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్ ఏలూరి సుధారాణి అభినందించారు.

ఘనంగా గీతా జయంతి



ఏలేశ్వరంలో గీతాపారాయణ చేస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు, మహిళలు

ఏలేశ్వరం: పట్టణంలో శనివారం గీతా జయంతిని ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరిటీ ఆధ్వర్యంలో స్థానిక వైఆర్‌సీ క్వార్టర్స్‌లోని గీతాశ్రమంలో వేడుకలు జరిపారు. మహిళలు గీతాపారాయణ, విష్ణు సహస్రనామ పారాయణ, లక్ష్మీ అష్టకం, గోవింద నామాలు పఠించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

న్యూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలి

ప్రత్తిపాడు: న్యూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 2023ను రద్దు చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) రాష్ట్ర అడ్‌హక్ కమిటి కన్వీనర్ బుగత శివ డిమాండ్ చేశారు. ఈ చట్టం వల్ల రెగ్యులర్ సివిల్ కోర్టులకు భూ వివాదాలను విచారించే అధికారం లేకపోవడంతో పేద, సామాన్య ప్రజలు నష్టపోతారన్నారు. ప్రజల స్థిరాస్తులను టైటిలింగ్ ఆఫీసర్లు నిర్ణయించడం సరికాదన్నారు. ఇప్పటికే రెవెన్యూ ఆఫీసర్లు ప్రజల భూ సమస్యలను వివాదాస్పదం చేస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రజా వ్యతిరేక చట్టాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు.

రాజేశ్వరి రామకృష్ణన్ మృతికి సంతాపం

గండేపల్లి: నీలాద్రిరావుపేట పరిధిలోని లయన్స్ నేత్ర వైద్యశాల దాత, ప్రముఖ పారిశ్రామిక వేత్త, చాగల్లు జైపూర్ సుగర్స్ ఫ్యాక్టరీ అధినేత రాజేశ్వరి రామకృష్ణన్ మృతికి శనివారం లయన్స్ కంటి ఆసుపత్రి సిబ్బందితో పాటు పలువురు సంతాప వ్యక్తం చేశారు. లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేదలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పి.సురేంద్రకుమార్, ట్రస్ట్ బోర్డు సభ్యులు నడుపల్లి ఆంజనేయులు, మేనేజర్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు ఇచ్చిన సర్వశిక్ష సిబ్బంది

ప్రత్తిపాడు: తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 26 నుంచి సమ్మె చేపడుతున్నట్టు సర్వశిక్ష సిబ్బంది తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రత్తిపాడు ఎంఈఓ వి.రాజబాబుకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సీఆర్పీల సంఘ అధ్యక్షుడు ఇ.రాంజీ ప్రసాద్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ప్రాజెక్ట్‌లో పని చేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అందరికీ మినిమం ఆఫ్ టైం స్కేల్ అమలు చేయాలని, ప్రస్తుతం ఉన్న పార్ట్‌టైం విధానాన్ని రద్దు చేసి, ఫుల్ టైం కాంటాక్ట్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. తమ సమస్యలను ఈ నెల 25 లోగా పరిష్కరించకుంటే 26 నుంచి సమ్మె చేపడతామని హెచ్చరించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు పట్టాభి రామయ్య, మల్లేష్, ఎ.రామకృష్ణ, గళ్లా శ్రీను, కె.రాజ్‌కుమార్, కె.సత్య తదితరులు పాల్గొన్నారు.

దళితుల ఆత్మీయ సమావేశం

కిర్లంపూడి: వచ్చే ఎన్నికల్లో దళితలందరూ కలిసి పని చేయాలని మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సూచించారు. జగపతినగరం న్యూమెన్ మిషన్ ప్రాంగణంలో జగ్గంపేట నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుడాల రాంబాబు అధ్యక్షతన శనివారం మండల దళిత ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత, టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల దీక్షలు

ఏలేశ్వరం: తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయాల అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేస్తున్న దీక్షలు శనివారం కొనసాగాయి. ఏలేశ్వరం దీక్షలో సీఐటీయూ ప్రాజెక్టు అధ్యక్షురాలు కె.సునీత, అమలావతి, వెంకటలక్ష్మి, రాణి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో చిల్లంగి వేంకటేశ్వరస్వామి



తాళ్లూరులో స్వామి వారిని దర్శించుకుంటున్న మాజీ ఎంపీ తోట నరసింహం



ఎస్.అన్నవరంలో స్వామివారిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకుంటున్న భక్తులు



సిరిపురంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దుర్గాప్రసాద్ దంపతులు

చూసిన కనులకు వైభోగం

- కన్నులపండువగా వైకుంఠ ఏకాదశి
- ఉత్తర ద్వార దర్శనాలకు పోటెత్తిన భక్తులు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

తుని రూరల్: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శనివారం ఉత్తర ద్వార దర్శనాలకు భక్తులు పోటెత్తారు. ఎస్.అన్నవరంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి, ఎన్.సూరవరంలో వేంకటేశ్వరస్వామి దేవస్థానాలకు తెల్లవారుజాము నుంచి భక్తులు బారులు తీరారు. స్వామివారిని ఉత్తర ద్వారం ద్వారా దర్శించి పూజలు చేశారు. ఎస్.అన్నవరంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. భక్తులకు దాతల సహకారంతో ఉచిత లడ్డూ, పులిహోర, పొంగలి తదితర ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఏలేశ్వరం: ముక్కోటి ఏకాదశి వేడుకలు నియోజకవర్గవ్యాప్తంగా శనివారం ఘనంగా జరిగాయి. తెలవారుజాము నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక సత్యనారాయణస్వామి ఆలయంలో భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని బాలాజీ చౌక్, లింగంపర్తి రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సిరిపురం శివాలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ స్వామివారిని దర్శించి పూజలు చేశారు.



తుని వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

వైభవంగా గిరి ప్రదక్షిణ

రౌతులపూడి: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ములగపూడిలో రామగిరికొండపై వెలసిన కోదండ రాముని ఆలయం చుట్టూ శనివారం భక్తులు గిరిప్రదక్షిణ చేశారు. స్థానిక పెద రామాలయం, ఆంజనేయస్వామివారి ఆలయం నుంచి పెద్ద ఎత్తున భక్తులు స్వామివార్లు ఆలయానికి చేరుకుని సుమారు 1.5 కిలో మీటర్ల మేర గిరి ప్రదక్షిణ చేశారు. ఆ ప్రాంతం గోవిందనామస్మరణతో మార్మోగింది.

వేడుకగా ఉత్తర ద్వార దర్శనం

గండేపల్లి: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని తాళ్లూరు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. పండితులు తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు ఉత్తర ద్వారం నుంచి దర్శనాలు కల్పించారు. మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ నాయకుడు తోట నరసింహం, మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, మణి దంపతులు, వైఎస్సార్ సీపీ యువ నాయకుడు తోట రాంజీ స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బ్యాండ్ మేళాలు, బాణసంచా కాల్పుల నడుమ హంస, గరుడ, అశ్వ, పొన్న, హంస, కల్పతరువు, శేష వాహనాలపై స్వామివారిని గ్రామంలో ఊరేగించారు. తాళ్లూరు శివాలయంలో రామలింగేశ్వర స్వామికి చామంతి పూలతో ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఒబిణ్ణి వీర బాబు, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ గఫూర్, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కిర్లంపూడి: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శనివారం చిల్లంగిలో వేంచేసిన వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు.

తుని: వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్థానిక పాత బజారు వీధిలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి పట్టణ నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి ఉత్తరద్వారం నంచి వేంకటేశ్వర స్వామిని దర్శించి తరించారు. పట్టణ ప్రముఖులు స్వామిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తొండంగి: వైకుంఠ ఏకాదశి కావడంతో శనివారం మండలంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దానవాయిపేట బీచ్‌రోడ్డులోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తరద్వారం నుంచి భక్తులకు స్వామివారి దర్శనాలు కల్పించారు. ఆలయ ప్రధానార్చకుడు శంకరణం వెంకటరాజు శర్మ ఆధ్వర్యాన స్వామివారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, గ్రామ సర్పంచ్ మడదా తిరుమల కుమారి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మడదా హేమంత్ స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఏవీ నగరం, యర్రయ్యపేట వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

గరుడ వాహనంపై దర్శనమిచ్చిన తంటికొండ వెంకన్న

గోకవరం: మండల వ్యాప్తంగా ముక్కోటి ఏకాదశి వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తంటికొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచే భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. విశేష సంఖ్యలో భక్తులు గరుడ వాహనంపై వేంచేసిన స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి), ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. గుమ్మళ్లదొడ్డిలోని శ్రీరామగిరి కొండపై వేంచేసిన రమాసత్యనారాయణస్వామి ఆలయం, గోకవరంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



తంటికొండలో గరుడ వాహనంపై వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



దానవాయిపేటలో వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు



ములగపూడి రామగిరికొండపై కోదండరాముని ఆలయం చుట్టూ గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు



రత్నగిరిపై విష్ణుమూర్తి, లక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చిన సత్యదేవుడు, అమ్మవారు



రత్నగిరిపై స్వామివారి రథాన్ని లాగుతున్న ఏసీ రమేష్ బాబు, ఏఈఓ కృష్ణారావు తదితరులు

రత్నగిరిపై ముక్కోటి సంబరం

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో శనివారం ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విష్ణుమూర్తి, లక్ష్మీదేవిగా అలంకరించి పూజించారు. వేలాది మంది భక్తులు ఉత్తరద్వారం నుంచి స్వామి, అమ్మవార్లను దర్శించి తరించారు. ఈ సందర్భంగా స్వామివారి ఆలయం, ఆలయ ప్రాంగణం, రాజగోపురాలకు చేసిన పుష్పాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. తెల్లవారుజామున 5 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఉత్తర ద్వార దర్శనానికి భక్తులను అనుమతించారు. అనివేటి మండపం వద్ద పూలతో తయారు చేసిన సత్యదేవుడు, అనంత లక్ష్మీ అమ్మవారి చిత్రాలను ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీ వద్ద భక్తులు ఫొటోలు, సెల్ఫీలు దిగి సందడి చేశారు. స్వామివారి రథోత్సవం కన్నులపండువగా జరిగింది. విశాఖ శ్రీశారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామిజీ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్, దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ రామచంద్రమోహన్ తదితరులు ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించారు.

పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ

తొండంగి: పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మంచి చేస్తున్న జగనన్న ప్రభుత్వం మళ్లీ రావాలని తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు అన్నారు. మండలంలోని శృంగవృక్షంలో శనివారం నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో 300 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పరితపిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ దూళిపూడి ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొయ్యా మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబు రాజు, పార్టీ మండల కన్వీనర్ బద్ది నూకరాజు, పార్టీ నాయకులు దడాల విజయ్, అంగుళూరి సుశీల, మండల సమన్వయ కమిటీ సభ్యుడు బెక్కం చంద్రగిరి, సర్పంచ్ దార అప్పన్న, తహసీల్దార్ జి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



శృంగవృక్షంలో లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వెండి గరుడ వాహనంపై సత్యదేవుని ఊరేగింపు

అన్నవరం: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని సత్యదేవుడు, అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవార్లను శనివారం రాత్రి అన్నవరం పురవీధుల్లో వెండి గరుడ వాహనంపై ఘనంగా ఊరేగించారు. రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు ఊరేగింపు కొనసాగింది. తమ ఇంటి ముంగిటకు వచ్చిన స్వామి, అమ్మవార్లకు గ్రామస్తులు నివేదనలు సమర్పించారు. అర్చకులు ప్రయాగ రాంబాబు, ముత్య వేంకట్రావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



గరుడ వాహనంపై సత్యదేవుడు, అమ్మవారిని ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు

గ్రామాల్లో క్రిస్మస్ సందడి



విద్యుత్ కాంతుల నడుమ ప్రత్తిపాడులోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చి

ప్రత్తిపాడు: గ్రామాల్లో క్రిస్మస్ సందడి నెలకొంది. క్రిస్మస్ వేడుకలకు నియోజకవర్గంలోని క్రైస్తవ ప్రార్థన మందిరాలు ముస్తాబయ్యాయి. ప్రత్తిపాడులోని సెయింట్ బాప్టిస్ట్ చర్చి, హోప్ మినిస్ట్రీస్ దేవాలయం, ఆర్‌సీఎం చర్చి, ఎల్‌ఎఫ్‌టీఎల్ చర్చి తదితర క్రీస్తు దేవాలయాలను శనివారం రాత్రి విద్యుత్ కాంతులతో దేదీప్యమానం చేశారు. పశువుల పాకతో పాటు పలు సెట్టింగులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే క్రైస్తవులు తమ ఇళ్ల వద్ద స్టార్లు, విద్యుత్ అలంకరణలు ఏర్పాటు చేశారు. మండలంలోని పలు ప్రార్థన మందిరాలు విద్యుత్ దీపాలంకరణలతో శోభాయమానంగా దర్శనమిస్తున్నాయి. వివిధ క్రైస్తవ ప్రార్థనా మందిరాల ఆవరణల్లో సర్వాంగ సుందరంగా పశువుల పాక (క్రిబ్) ఏర్పాటు చేశారు. కొంతమంది తమ ఇళ్ల వద్ద పశువుల పాకలను ఏర్పాటు చేసి, ఆకట్టుకునేలా విద్యుత్ సెట్టింగులతో తీర్చిదిద్దారు.

ఉచిత వైద్య శిబిరం

గండేపల్లి: మండలంలోని సూరంపాలెంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ ఉప సర్పంచ్ స్వామిన మణిభాస్కర్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రాజానగరం జీఎస్ఎల్, కాకినాడ విజన్ ఐ కేర్, స్థానిక నయన ఆస్పత్రి వైద్య సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు చేసిన ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, గ్రామస్తులు పాల్గొన్నారు.

హిందూధర్మ పరిరక్షణ అందరి బాధ్యత

కోటనందూరు: హిందూ ధర్మాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కాకినాడ గీతాశ్రమం పీఠాధిపతి శ్రీదివ్యానంద సర్వసతీ స్వామీజీ అన్నారు. మండలంలోని బొద్దవరంలో సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఆధ్యాత్మిక కళా ప్రదర్శనలతో శోభాయాత్ర నిర్వహించారు. ధర్మాన్ని ఆచరిద్దాం, ధర్మపరిరక్షణకు నడుం బిగిద్దాం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దివ్యానంద సరస్వతీ స్వామీజీ మాట్లాడుతూ ప్రజలంతా ఎంతో గొప్పదైన సనాతన ధర్మాన్ని పాటించాలన్నారు. ఆధ్యాత్మిక చింతన, సత్ప్రవర్తనే జీవితానికి ముక్తి అన్నారు. కార్యక్రమంలో సమరసత ఫౌండేషన్ గోదావరి విభాగ ప్రచారక్(ఆర్‌ఎస్‌ఎస్) నండూరి కృష్ణ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



తునిలో పేదలకు అన్నదానం చేస్తున్న కోరుబిల్లి ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు

తుని: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని కోరుబిల్లి ఫౌండేషన్, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పేదలకు అన్నదానం చేశారు. స్థానిక గొల్ల అప్పారావు సెంటర్లో 300 మందికి భోజనాలను అందించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కలిదిండి సత్యనారాయణరాజు, తుని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రావి సుబ్రహ్మణ్యం, జీవీవీ సత్యనారాయణ, జూరెడ్డి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కరోనాపై అప్రమత్తంగా ఉండాలి

తొండంగి: దేశంలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు కోవిడ్‌పై అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు పాటించాలని ఏవీ నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవికుమార్ సూచించారు. ఈ మేరకు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ జె.నరసింహ నాయక్ నుంచి మార్గదర్శకాలు వచ్చాయన్నారు. ప్రతిఒక్కరూ భౌతిక దూరం పాటించాలన్నారు. మాస్కులు ధరించాలన్నారు. జలుబు, తుమ్ములు, దగ్గు, జ్వరం తదితర లక్షణాలు ఉంటే వైద్యారోగ్య సిబ్బందిని సంప్రదించాలని డాక్టర్ రవికుమార్ సూచించారు.

ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేయండి



గోకవరంలో వన్‌కే రన్ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

గోకవరం: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ పిలుపునిచ్చారు. ఆడుదాం–ఆంధ్రాలో భాగంగా శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి సచివాలయం వరకూ అధికారులు, ప్రజాప్రతినిధులు వన్ కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీవల్లి మాట్లాడుతూ జనవరి 26 నుంచి ఫిబ్రవరి 9 వరకు గ్రామస్థాయిలో కబడ్డీ, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, క్రికెట్ వంటి పోటీలు నిర్వహిస్తారన్నారు. ఆసక్తి కలిగిన యువత ఈ క్రీడల్లో పాల్గొని ప్రతిభ చూపాలన్నారు. క్రీడా పోటీలను విజయవంతం చేయడానికి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, ఎంపీడీఓ కె.పద్మజ్యోతి, ఎంఈఓ గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

రౌతులపూడి: మండల వ్యాప్తంగా గతేడాది నిర్వహించిన ఉపాధి హామీ పనులపై రౌతులపూడిలో శనివారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఎంపీడీఓ ఎం.గోవింద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సామాజిక తనిఖీలో డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్ ఎం.జోతి ముఖ్య అతిథులుగా హాజరై సమీక్షించారు. ఎస్‌ఆర్‌పీ చిరంజీవి వివిధ గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనుల వివరాలను సమావేశంలో చదివి వినిపించారు. గతేడాది ఉపాధి, పంచాయతీరాజ్, సర్వశిక్షా భియాన్, ఆర్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించి 657 పనులకు గాను రూ.9.48 కోట్లుపైగా ఖర్చు చేశారు. ఆయా రికార్డులను అధికారులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, ఉపాధి ఏపీడీ రమేష్, ఏపీఓ రాజగోపాల్ పాల్గొన్నారు.



రౌతులపూడిలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి

ఉపాధి పనులతోనే అభివృద్ధి సాధ్యం

శంఖవరం: గ్రామాల్లో నిర్వహించే ఉపాధిహామీ పనుల ద్వారానే అభివృద్ధి సాధ్యమని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ అడపా వెంకటలక్ష్మి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ పర్వత రాజబాబు అధ్యక్షతన 15వ విడత ఉపాధి హామీ సామాజిక తనిఖీ నిర్వహించారు. మండల వ్యాప్తంగా 2022–23 సంవత్సరంలో చేపట్టిన పనులకు సంబంధించి రికార్డులు తనిఖీ చేశారు. రికార్డులు సరిగ్గా లేకపోవడంతో సిబ్బంది నుంచి రూ.1.38 లక్షల రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మన్ ఎం.జ్యోతి, ఏపీడీ జి.రమేష్, ఎంపీడీఓ జి.శివరామకృష్ణ, ఏపీఓ రాజ్‌గోపాల్ పాల్గొన్నారు.

సత్యనారాయణకు బెస్ట్ వాకర్స్ ప్రెసిడెంట్ పురస్కారం

తుని: స్థానిక వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కుందెం సత్యనారాయణను బెస్ట్ వాకర్స్ ప్రెసిడెంట్ పురస్కారం వరించింది. విశాఖపట్నంలోని వాకర్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో అంతర్జాతీయ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సుంకర రవీంద్ర ఈ పురస్కారాన్ని సత్యనారాయణకు అందజేశారు. 2023 సంవత్సరంలో తుని వాకర్స్ క్లబ్ నిర్వహించిన సేవా కార్యక్రమాలకు గాను ఈ అవార్డు దక్కినట్లు క్లబ్ స్థానిక గౌరవ అధ్యక్షుడు కలిదిండి సత్యనారాయణరాజు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేసేందుకు ఈ పురస్కారం దోహదపడుతుందని ఎలక్ట్ గవర్నర్ చదరం శివాజీ అన్నారు. అవార్డు గ్రహీతను వాకర్స్ అభినందించారు.



బెస్ట్ వాకర్స్ ప్రెసిడెంట్ అవార్డు అందుకుంటున్న సత్యనారాయణ